క్లుప్తంగా

టీపీబీవోస్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ



హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: టౌన్ ప్లానింగ్ విధులపై ప్రాథమిక అంశాలు, పలు జీవోలను క్రోడీకరించి రూపొందించిన టీపీబీవోస్ హ్యాండ్ బుక్‌ను సుడా వైస్ చైర్మన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం ఆవిష్కరించారు. టీపీవోస్ హ్యాండ్ బుక్‌ను సంకలనం చేసిన సుడా జేపీవో ఇటికాల భాస్కర్ మాట్లాడుతూ.. కొత్తగా టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగంలో చేరిన టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఈ బుక్ ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం భాస్కర్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య అభినందించారు. ఈ కార్యక్రమంలో సుడా డీసీపీ రాజ్ కుమార్, మున్సిపల్ ఏసీపీ వసుంధర, ఏపీవో ఖాదర్, టీపీఎస్ నరేష్ పాల్గొన్నారు.

అమ్మానాన్న లేకున్నా.. చదువులో మేటిగా..



ఉమామహేశ్వరిని సన్మానిస్తున్న కార్పొరేటర్, తదితరులు

ఖమ్మం అర్బన్: తల్లిదండ్రులు లేరనే బాధను దిగమింగుకుని మేనమామ అండతో జీవిస్తున్న బాలిక ఇంటర్‌లో ప్రతిభ కనబరిచింది. మధిర మండలం సిరిపురానికి చెందిన ఉమామహేశ్వరి తల్లిదండ్రులు చిన్నతనంలో మృతి చెందగా.. మేనమామ శంకర్, ఆదెమ్మ అండగా నిలిచారు. పదో తరగతిలో 9.2 జీపీఏ సాధించిన ఆమె ఇంటర్ ప్రథమ సంవత్సరం ఖమ్మంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదివి ఎంపీసీలో 470కి 465 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరిని కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు బుధవారం సన్మానించి ఉన్నత విద్యకు సహకరిస్తామని తెలిపారు. బొందిల అయ్యప్పసింగ్, కాల నీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమతరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ యాదగిరి, ఏఈ లక్ష్మణ్‌రావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైసమ్మగుడి ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వీఆర్‌కే సిల్క్ వెనక వైపు, వరదయ్యనగర్, మమత ఆస్పత్రి రోడ్డు, లకారం ట్యాంక్‌బండ్ వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోషణపక్షం కార్యక్రమం

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజి సయ్యద్ మదర్ సాబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఇమామ్ భోజనాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య, ఏఓ సీతారాంరెడ్డి, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	46		20
కాకర	40	చుక్కకూర	4
బీర	50		20
దొండ	16	తోటకూర	4
పొట్లకాయ	36		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	36		20
క్యాబేజీ	16	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	28	పుదీన	1
క్యాప్సికం	50		20
బీట్‌రూట్	26	-ఖమ్మం వ్యవసాయం	

నగరంలో సినిమాలు

తిరుమల	ఓదెలా 2
వినోద	మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	ఒక్కడు
ఆదిత్య	అర్జున్ S/o వైజయంతి
శ్రీనివాస	జాక్

- ఖమ్మం గాంధీచౌక్

మరమ్మతులకు మోక్షం ఎన్నడో?

వరదలకు దెబ్బతిన్న రహదారి

- నేటికీ బాగుచేయకపోవడంతో వాహనదారుల ఇక్కట్లు



కాజ్‌వేకు ఏర్పాటుచేసిన రాళ్లు విరగడంతో ప్రమాదకరంగా మారిన ప్రాంతం



దెబ్బతిన్న రహదారి

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ అలుగుల సమీపాన నిర్మించిన కాజ్‌వే రహదారి గత సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదలకు కొట్టుకపోయింది. దీంతో పాటు కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న రక్షణ రాళ్లు సైతం వరదనీటిలో కొట్టుకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రయాణం చేసేవారు హడలిపోతున్నారు. రిజర్వాయర్ అలుగుల ప్రాంతంలో అరకిలోమీటరు మేర ఉన్న ఈ రహదారి తీవ్రంగా దెబ్బతినగా వరద ఉధృతి తగ్గిన తరువాత అధికారులు ధ్వంసం అయిన బీటీని తొలగించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కానీ రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహించలేదు. దీంతో ఈ దారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఖమ్మం - సూర్యాపేట మార్గం కావడంతో బస్సులతో పాటు ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇక కాజ్‌వేకు ఇరువైపులా రక్షణగోడలు, రాళ్లు లేకపోవటంతో మరింత ప్రమాదం పొంచి ఉంది. కాజ్‌వేకు ఇరువైపులా పెద్దపెద్ద బండరాళ్లు ఉండటంతో వాహనాలు అదుపుతప్పితే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రహదారి గోతులమయం కావటంతో పాటు డివైడర్ కొట్టుకుపోయి నామరూపాలు లేకుండా పోయింది. దీంతో వాహనదారులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఈ కాజ్‌వే రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో ప్రయాణం ప్రమాదకరంగా మారటంతో తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు సరిగా లేక ఇబ్బంది...

పాలేరు అలుగుల వద్ద కొద్దిదూరం రోడ్డు వరదలకు కొట్టుకపోయింది. దాన్ని పూర్తిగా బాగు చేయలేదు. రోడ్డు బీటీ కొట్టుకపోయి, గుంతలు పడి ప్రమాదంగా మారింది. నిత్యం ప్రయాణికులతో తిరుగుతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– నర్రా వెంకన్న, ఆటోడ్రైవర్

త్వరలోనే పనులు చేపడతాం..

ఈ రహదారి మరమ్మతులకు టెండర్లు ఖరారు కావల్సి ఉంది.అది పూర్తయిన వెంటనే పనులను ప్రారంభిస్తాం. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం

– దేవేందర్, ఆర్అండ్‌బీ ఏఈ

ఆడపిల్లలను సమానంగా చూడాలి

కామేపల్లి: తల్లిదండ్రులు ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం సాతానిగూడెం గ్రామానికి చెందిన షేక్ మొబీనా- అఫ్రిద్ దంపతులకు ఇటీవల ఆడపిల్ల జన్మించగా వారిని 'మా పాప- మా ఇంటి మణిదీపం'లో భాగంగా సన్మానించి స్వీట్లు,పండ్లు అందజేసి ప్రశంస పత్రాన్ని అందించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, ఆర్ఐ సక్రు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కామేపల్లి: దంపతులను సన్మానిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేటలో ఎస్కే.జాకీయ బేగం, పాషా దంపతులకు ఆడపిల్ల పుట్టడంతో అధికారులు ఆ ఇంటికి వెళ్లి స్వీట్లు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: హైదర్‌సాయిపేటలో..

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు పుట్టిన ఇళ్లకు వెళ్లి చినారులను ఆశ్వీరదించి, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ యం.యర్రయ్య, అధికారులు రత్నకుమారి, లక్ష్మికుమారి, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సౌజన్య-రాహుల్ దంపతులకు ఆడబిడ్డ పుట్టగా వారి ఇంటికి అధికారులు వెళ్లి దంపతులను సన్మాంచారు. తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, సీడీపీఓ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమా, రమాదేవి, సువర్చల, తదితరులు ఉన్నారు.



నేలకొండపల్లి: చెన్నారంలో..



కూసుమంచిలో..

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి, రెజొనెన్స్ డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎస్ఈ ఈ.శ్రీనివాసాచారి ముఖ్య అతిథిగా హాజరై రెజొనెన్స్ డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో జాగ్రత్త..

ఖమ్మంఅర్బన్: విద్యార్థులు వేసవి సెలవుల్లో జాగ్రత్తగా మసలుకోవాలని హెచ్ఎం శ్రీదేవి అన్నారు. నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం జెడ్పీ పాఠశాలలో బుధవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు హెచ్ఎం అందజేశారు.

తిరుమలాయపాలెం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. హెచ్ఎం విజయ్ కుమారి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, హమీద్, శ్రీనివాసరావు, హనుమంతు, గోపమ్మ, శేష ఫణి, రఘు బాబు, నరేందర్, కృష్ణత కళ, శోభన, శ్యామ్‌కుమార్, నాగేశ్వరరావు, ప్రసాద్, విజయలక్ష్మి, ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ఏడీఏ సరిత

కూసుమంచి: రైతులు పంటలసాగు లాభదాయకంగా ఉండాలంటే తొలుత భూసార పరీక్షలు చేయించుకోవాలని కూసుమంచి ఏడీఏ సరిత అన్నారు. మండలంలోని కిష్టాపురం, పోచారం గ్రామాల్లో డిజిటల్ గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో భూసార పరీక్ష నిర్ధారణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు ప్రతీ మూడేళ్లకొకసారి పరీక్షలు చేయించుకోవాలని, దీని వలన భూమికి ఏ పోషక విలువలు అవసరమో గుర్తించి అందించవచ్చన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ద్వారా అన్ని గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వాణి ,ఏఈఓలు ప్రియాంక, సాయిరాం, డిజిటల్ గ్రీన్ సంస్థ కోఆర్డినేటర్ యశోద పాల్గొన్నారు.

'భూ భారతి'తో వేగంగా పరిష్కారం

నేలకొండపల్లి: భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని, ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి యం.రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుద్ధారం, గువ్వలగూడెం గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ, నమోదు పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి వారి ఏ సమస్యల పై దరఖాస్తులు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లువి.వెంకటేశ్వర్లు, తఫ్జల్‌హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి, వ్యవసాయ విస్తరణాధికారి శిరీష పాల్గొన్నారు.

పహల్గాం దాడి కిరాతక చర్య



ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దారుణంగా కాల్పులు జరిపి 26 మంది భారతీయులను చంపేయడం అత్యంత కిరాతక చర్య అని పలువురు అన్నారు. దాడికి నిరసనగా బుధవారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఉగ్రవాదుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడిపై ప్రభుత్వం తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉగ్రవాదుల దాడిని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి పోటు రంగారావు, బీజేపీ తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్, సభ్యులు, తదితరులు ప్రకటనల్లో ఖండించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



కామేపల్లిలో..



నేలకొండపల్లిలో..



ఖమ్మంగాంధీచౌక్: కొవ్వొత్తుల ర్యాలీలో ఖమ్మం చాంబర్ ప్రతినిధులు

రేపు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం చైతన్యనగర్‌లోని శ్రీ ధర్మశాస్తా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన 41 రోజులు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మేకల హన్మంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మాలధారులు ఇరుముడితో పదునెట్టాంబడి మీదుగా ఆలయానికి చేరుకుని స్వామికి నెయ్యితో అభిషేకం చేస్తారని వెల్లడించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు రేపు డ్రా

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతిలో 2025, 26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఈనెల 25న పాఠశాలలో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ బడిలోనే ఉన్నతమైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రఘునాథపాలెం: ప్రభుత్వ బడిలోఉన్నతమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని హెచ్ఎం వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ, సదస్సు విజయవంతం చేయాలి

ఖమ్మం అర్బన్: ఈనెల 25న ఖమ్మంలో నిర్వహించనున్న సకల ఉద్యోగుల బైక్ ర్యాలీ, సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రాలను ఇందిరానగర్ పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, సిటీ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ నుంచి టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి సాయంత్రం 6 గంటలకు సదస్సు నిర్వహిస్తామన్నారు. టీఎస్‌యుటీఎఫ్ సిటీ అధ్యక్షుడు జె. శ్యామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రోజా, నాయకులు వి.నర్సింహారావు, రవి, రమేష్ బాబు, రాజేష్, అనురాధ, ఉమాదేవి, అఖిల, నాగప్రసన్న, చందన పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 25న నిర్వహించనున్న ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ టీజేఏసీ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

గిరిజన హక్కులు హరిస్తున్న బీజేపీ

కూసుమంచి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజన హక్కులపై దాడి చేస్తుందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతుసంఘం నాయకులు బండి రమేష్ అన్నారు. బుధవారం కూసుమంచిలో నిర్వహించిన సంఘం పాలేరు డివిజన్ సదస్సులో వారు మాట్లాడారు. ఖమ్మంలో గిరిజన యూనివర్సిటీ వెంటనే ఏర్పాటు చేయటంతో పాటు ప్రతీ తండాకు మౌలిక వసతుల కల్పనకు రూ.25 లక్షల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి భూక్యా హరిబాబు, నాయకులు బాసూనాయక్, మూడ్ గన్యా, భూక్యా కృష్ణ, హలావత్ నర్సింహారావు, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి కొమ్ము శ్రీను, మల్లెల సన్మంతరావు, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూములపై ప్రభుత్వాల జోక్యం తగదు



మాట్లాడుతున్న ప్రసేన్

ఖమ్మం మామిళ్లగూడెం: వక్ఫ్ భూములపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం తగదని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు బుధవారం రాజాంగ పరిరక్షణ వేదిక సంఘం కార్యాలయంలో జరిగిన నాలుగు మండలాల సన్నాహక సదస్సులో వారు మాట్లాడుతూ. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు చట్టంను కేంద్రం తక్షణమే రద్దు చేసుకోవాలని, సమస్యల పరిష్కారానికి బహుజనులంతా వారి గళాన్ని శాంతి మార్గంలో వినిపించాలన్నారు. ఈ సదస్సులో రూరల్ సీఐ రాజు, ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్, కేవీ కృష్ణారావు, రచయిత, జర్నలిస్ట్ ప్రసేన్, సుభాని మియా, అహ్మద్ మియా, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ సైదా సాహెబ్, సుభాన్, ఎండి.గౌస్‌పాషా, హుస్సేన్, సైదా పాషా, ఎండీ. రషీద్, మౌలానా, నజీరుద్దీన్, యాసిన్ ఉన్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు

- వీధికుక్కల స్వైరవిహారం
- వాహనాల వెంటపడి తరుముతున్న వైనం
- వికృతంగా మారుతుండటంతో భయాందోళన



వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కామేపల్లి: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలను తీవ్రభయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా సంచరిస్తూ నిత్యం ఏదో ఒక చోట చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనదారులను వెంటపడి తరుముతూ పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రివేళల్లో సంచరిస్తూ రోడ్లపై వెళ్లేవారిపై దాడులు చేస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాక పశువులు, గొర్రెలు, మేకల మందలపై దాడి చేసి పదుల సంఖ్యలో జీవాలను చంపిన ఘటనలూ ఉన్నాయి. ఎన్ని ఘటనలు చోటుచేసుకుంటున్న వీధి కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వీధుల్లోకి వెళ్లాలంటే భయం గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణపై నిర్లక్ష్యం..


వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కుక్కల సంతతి పెరగకుండా నియంత్రణకు చర్యలు చేపట్టాలి. కానీ అలాంటి ప్రక్రియ జరగకపోవడంతో కుక్కల బెడద పెరిగిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుక్క కాటుతో రేబిస్ సోకే ప్రమాదం ఉందని, 24 గంటల్లోపు వైద్యాన్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చర్మ వ్యాధులతో..



మండలంలో వీధి కుక్కలు వికృతంగా కనిపిస్తున్నాయి. కుక్కలు కొత్తరోగంతో బక్కచిక్కిపోయి, వాటి శరీరంపై ఉన్న జుట్టు రాలి, ఒంటి నిండా పుండ్లు వాటి నుంచి రక్తం కారుతూ ఆ కుక్కల ఆకారం వికృతంగా మారుతోంది. ఈ వ్యాధి ఒక దాని నుంచి మరోకదానికి వ్యాప్తిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో వీధుల్లో కుక్కలు కనబడితే స్థానికులు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే అధిక శాతం వీధి కుక్కలు చర్మ వ్యాధి బారిన పడ్డాయి. వీధి కుక్కల ద్వారా చర్మవ్యాధులు పెంపుడు కుక్కలకు కూడా సోకుతున్నట్లు పెంపుడు కుక్కల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ కుక్కలతో భయంగా ఉంది



మా గ్రామంలో చాలా రోజులుగా కుక్కలు చర్మవ్యాధి సోకి వికృతంగా కనిపిస్తున్నాయి. కుక్కల శరీరంపై ఉన్న జుట్టు రాలిపోయి రక్తం కారుతూ పురుగులు పడినవి. ఈ కుక్కలను చూస్తే భయంగా ఉంది. ఈ కుక్కలు వస్తున్నాయంటే దూరంగా వెళ్తున్నాం. కుక్కల నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– అంబడిపూడి రాము,పండితాపురం